క్లుప్తంగా

రోడ్డుపై పారుతున్న మురుగుతో అవస్థలు



బ్రాహ్మణపల్లిలో ఇళ్ల మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

కూడేరు: మండలంలోని బ్రాహ్మణపల్లిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేశారు. డ్రైనేజీ పైపులు అక్కడక్కడ పగిలి మురుగునీరు ఇళ్లమధ్య రోడ్డుపై పారుతోంది. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల బెడదతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వసంత పంచమి పూజలు



అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

ఉరవకొండ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిలం లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వసంత పంచమిని పురస్కరించుకొని ఆదివారం పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కొందరు తమ చిన్నారులను స్వామి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయించారు. దీంతో పాటు ఆలయ సన్నిధిలో వివాహాలు జరిగాయి. ఉదయం స్వామికి అభిషేకం, మహా మంగళహారతి నిర్వహించారు.

హైస్కూల్ రోడ్డులో అక్రమ కట్టడాలు



హైస్కూల్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా అక్రమ కట్టడాలు

కూడేరు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డును స్థానికులు కొందరు ఆక్రమించి, కట్టడాలు చేపట్టారు. దీంతో రోడ్డు కుచించుకుపోతోంది. మండల కేంద్రంలోని అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి 30 అడుగుల దూరంలో ఉన్న రోడ్డుపై అక్రమంగా నిర్మిస్తున్నారు. త్వరలో పాఠశాల జూనియర్ కాలేజ్ ఏర్పాటు కానుంది. స్థానికంగా ఒకరు ఇంటి ముందు రోడ్డుపైకి వచ్చి గది నిర్మాణపు పనులు చేపట్టాడు. శనివారం మరో వ్యక్తి రోడ్డు పక్కనే పునాది పనులు ప్రారంభించాడు. హైస్కూల్‌లోనే పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడంతో జిల్లా అధికారులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. కుచించుకుపోయిన రోడ్డుపై వెళ్లడానికి ఇబ్బందులుపడుతున్నారు. అక్రమ కట్టడాలపై పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా స్థానికులు ఫిర్యాదు చేసినా స్పందించలేదు.

పింఛన్ల డబ్బు ఇవ్వకుండా జాప్యం




వేలిముద్రలు వేసుకొని పింఛన్ డబ్బు ఇవ్వలేదని చెబుతున్న వృద్ధులు

కళ్యాణదుర్గం: ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛను పంపిణీ చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.. సకాలంలో పంపిణీ చేయకపోవడంతో పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని గూబనపల్లి 24 వార్డులో 11వ వార్డు సచివాలయంలో 30 మంది వివిధ రకాల పింఛనుదారులు ఉన్నారు. వార్డు అనిమిటీస్ సెక్రటరీ తేజ ప్రకాష్ ఈనెల 1న 17 మంది వృద్ధులతో పింఛను కోసం వేలి ముద్రలు వేయించుకున్నాడు. అదే రోజు పింఛను డబ్బు ఇవ్వలేదు. ఎందుకు ఇవ్వలేదని వృద్ధులు ప్రశ్నించగా, సర్వర్ బిజీగా ఉందని మరో రోజు వస్తానంటూ వెళ్లిపోయాడు. అయితే అనుమానం వచ్చిన వృద్ధులు.. ఆదివారం సచివాలయ సిబ్బందిని ఫోన్లో నిలదీశారు. ఈ విషయం మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణభార్గవ్ సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. వేలిముద్రలు వేయించుకున్న వారికి వెంటనే డబ్బు ఇవ్వాలని ఆదేశించారు. వెంటనే వార్డు సచివాలయ సిబ్బందిని అక్కడికి పంపి పింఛన్ డబ్బు పంపిణీ చేయించారు.

రాత్రి చలి..పగటిపూట ఎండ

రాయదుర్గంటౌన్: పూర్తి స్థాయి వేసవి సమీపించకముందే ఫిబ్రవరి మొదటి వారంలోనే ఎండలు మండుతున్నాయి. ప్రస్తుతం రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏరియాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలు, అత్యల్పంగా 20 డిగ్రీలుగా నమోదవుతోంది. ఫిబ్రవరిలోనే ఎండ ప్రతాపం చూపిస్తే ముమ్ముందు ఎలా ఉంటుందో అని ప్రజలు భయపడే పరిస్థితి ఉంది. మధ్యాహ్నం 1 గంట నుంచి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఎండల తీవ్రతకు జనం శీతల పానీయాలు, మజ్జిగ, పుచ్చకాయల వైపు మొగ్గు చూపుతున్నారు.

ఇంటికో ఉద్యోగం ఏదీ బాబూ?



మెగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగుల ఎదురుచూపు

- అతీగతీలేని నిరుద్యోగ భృతి
- ఎన్నికల హామీలు ఏ ఒక్కటీ అమలుకాని వైనం
- ఆందోళనలో నిరుద్యోగ యువత

ఉరవకొండ: 'మేము అధికారంలోకొస్తే ఇంటికో ఉద్యోగం ఇస్తాం.. ముఖ్యంగా యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. అలా కాని పక్షంలో నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి ఇచ్చే బాధ్యత తీసుకుంటాం. ఏటా జాబ్ క్యాలెండర్ ప్రకటించి, ఉద్యోగాలు భర్తీ చేస్తాం.. యువత కొలువుల కల సాకారం చేసే బాధ్యత మాది.. యువతకు మేమిచ్చే కానుక ఇదే.. తమ్ముళ్లూ కూటమిని గెలిపిస్తే ఇవన్నీ నెరవేరుతాయని గుర్తించుకోండి..' అని ఉరవకొండ వేదికగా 2024 జనవరి 28న రాకదలిరా సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇవేమాటలను మరో సారి ఉరవకొండ వేదికగా 2024 మార్చి 9న శంఖరావ సభలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఊదరగొట్టారు. అధికారంలోకొచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఒక ఉద్యోగ నియామక నోటిఫికేషన్ లేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల పరిధిలో 278 సచివాలయాలు ఉన్నాయి. 3,22,500 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు దాదాపు 62వేల మంది ఉన్నారు. వీరంతా కూటమి చంద్రబాబు, లోకేష్ చెప్పినట్లు ఉద్యోగాలు వస్తాయని, నోటిఫికేషన్లు విడుదల చేస్తారన్న ఆశతో ఉన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అండ్ కో ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేసింది. అందులో సూపర్‌సిక్స్ పేరుతో ఊదరగొట్టారు. అలాగే ఇంటికో ఉద్యోగం, 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక వాటి ఊసేలేదు. ఉద్యోగాలు కల్పించకోయినా నిరుద్యోగ భృతి రూ3వేలు మంజూరు అవుతుందని వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.



డీఎస్సీ నోటిఫికేషన్ ఎప్పుడు బాబూ..?

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామని ఆశ చూపుతూ వాయిదాలతో కాలం నెట్టుకొస్తున్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను ఆగస్టు నెలలో విడుదల చేసిన ప్రభుత్వం.. డిసెంబర్‌లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. దీంతో ఎంతో ఆశతో సామాన్య, మధ్య తరగతికి చెందిన అభ్యర్థులు పట్టణాలకు వెళ్లి రూ.వేలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారు. ఉరవకొండ నియోజకవర్గం నుంచే అత్యధికంగా అనంతపురం, కర్నూలు తదితర నగరాల్లో డీఎస్సీ శిక్షణ కోసం వెళ్లారు. ఆర్థిక ఇబ్బందులతో చాలా మంది శిక్షణ కోసం అప్పులు చేసి వెళ్లారు.

నోటిఫికేషన్ విడుదల చేయాలి



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలి. ఈఏడాది జనవరికి మంత్రి లోకేష్ జాబ్ క్యాలెండర్ ప్రకటించకుండా తీవ్ర నిరాశ పరిచారు. నిరుద్యోగుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి.

– సుమ బిందు, బీఎస్సీ, విడపనకల్లు

నిరుద్యోగ భృతి ఇవ్వాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగులకు ప్రతి నెలా రూ.3వేలు భృతి ఇస్తామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటై 8నెలల కావస్తోంది. ఇప్పటి వరకు ఉద్యోగాలు లేవు. భృతి ఇవ్వలేదు. ఎలా బతకాలి? కనీసం ప్రైవేట్ కంపెనీల్లో అయినా ఉద్యోగావకాశాలు కల్పించాలి.

– మాల తేజ, బీఏ, ఉరవకొండ

రూ.80 వేలు పెట్టి కోచింగ్ తీసుకుంటున్నా..



రోజు కూలి పనులకు వెళ్తేగానీ పూట గడవని కుటుంబం మాది. అలాంటిది ఎలాగైనా డీఎస్సీ ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో అప్పు చేసి లాంగ్‌టర్మ్ డీఎస్సీ కోచింగ్ కర్నూలులో తీసుకుంటున్నా. ప్రభుత్వం ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వడంలో తీవ్ర నిర్లక్ష్యం చేస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి.

– రజియా బీ, బీఎస్సీ, బీఈడీ, ఉరవకొండ

నిరుద్యోగులకు తీరని అన్యాయం



ఉరవకొండలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌బాబు నిరుద్యోగులకు ఎన్నో హామీలు ఇచ్చారు. వాటిని అమలు చేయలేదు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షల మంది నిరుద్యోగులు జాబ్ క్యాలెండర్ ప్రకటన కోసం ఎదురుచూసి జనవరికి విడుదల చేయకపోవడంతో తీవ్ర నిరాశ చెందారు. నిరుద్యోగ భృతి కూడా అమలు చేయకుండా మోసం చేశారు.

– నవీన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు, కూడేరు

'ఫీజు పోరు' విజయవంతం చేద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న రంగయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం రూరల్: ఫీజు పోరును విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని కుర్లపల్లిలో ఈనెల 5న అనంతపురంలో నిర్వహించనున్న ఫీజు పోరు కార్యక్రమ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం కుర్లపల్లి గ్రామంలోని వైస్ ఎంపీపీ అనురాధమ్మ, హనుమంతురాయుడు నూతన గృహప్రవేశ వేడుకలో ఆయన పాల్గొన్నారు. కుందుర్పి మండలంలోని తెనగల్లు గ్రామం సర్పంచ్ వరలక్ష్మి, నూతన గృహ ప్రవేశ వేడుకలోనూ పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బోయ తిప్పేస్వామి, డాక్టర్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొమ్మన్న, జిల్లా యాక్టివిటీ కార్యదర్శి ఎర్రంపల్లి కృష్ణమూర్తి, మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్షా, మాజీ వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ పాలాక్షి, జెడ్పీటీసీ సభ్యులు రాధాస్వామి, సర్పంచులు విజయ్, జగన్, కౌన్సిలర్ లక్ష్మన్న, లాయర్ రామాంజనేయులు, నాయకులు నారాపురం వెంకటేశులు, మల్లన్న, మల్లి, వెంకటేశులు పాల్గొన్నారు.

కూటమి సర్కార్‌తో విద్యావ్యవస్థ భ్రష్టు



ఫీజుపోరు పోస్టర్లను విడుదల చేస్తున్న పార్టీ యువజన విభాగం చైర్మన్ ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: కూటమి ప్రభుత్వంతో విద్యా వ్యవస్థ భ్రష్టు పట్టిందని పార్టీ యువజన విభాగం రాయలసీమ జిల్లాల జోనల్ చైర్మన్ యువనేత వై.ప్రణయ్ రెడ్డి విమర్శించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఈనెల 5న కలెక్టరేట్ వద్ద జరగనున్న వైఎస్సార్‌సీపీ ఫీజుపోరు నిరసన పోస్టర్లను వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నవీన్‌రెడ్డి ఆధ్వర్యంలో విడుదల చేశారు. అనంతరం యువజన, విద్యార్థి విభాగాల ముఖ్య సమావేశం నిర్వహించారు. యువనేత వై.ప్రణయ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు అందాల్సిన వసతి దీవెన, రీయింబర్స్‌మెంట్ బకాయి చెల్లించకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేస్తూ, అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అటవీ భూములు కబ్జా చేశారని పచ్చమీడియాలో తప్పుడు రాతలు రాయించి, ఆ కుటుంబ ప్రతిష్ట దెబ్బతినేలా చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.

మార్మోగిన నాగప్ప స్వామి నామస్మరణ



నాగదేవతల ప్రతిమలు

కూడేరు: మండలంలోని కొర్రకోడు – చోళసముద్రం గ్రామాల మధ్య వెలసిన అతిపురాతన గుండు నాగప్ప స్వామికట్ట వద్ద ఆదివారం నాగదేవతల ప్రతిష్ట చేశారు. గుండు నాగప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

క్రిమిసంహారక నీరు తాగి గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

కళ్యాణదుర్గం రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో ఆదివారం విషపు నీరు తాగి రైతు కావేలప్పకు చెందిన రెండు గేదెలు మృతిచెందాయి. దొడగట్టకు చెందిన రైతు కావేలప్ప రోజులాగే గేదెలను పొలం వద్దకు తీసుకెళ్లాడు. పంటకు పిచికారీ చేసిన నీరు తాగి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. సుమారు రూ.1 లక్షపైగా నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

17 గొర్రెలు మృతి

కణేకల్లు: మండలంలోని జక్కలవడికి గ్రామంలో బోరువద్ద నీరు తాగి 17 గొర్రెలు మృతిచెందాయి. గొర్రెల కాపరులు రాముడు, వన్నూరుస్వామి గొర్రెలను మేత కోసం తీసుకెళ్లారు. నీళ్లు తాపడానికి బోరుబావి వద్దకు తీసుకెళ్లారు. నీరు తాగిన గొర్రెలు కాసేపటి తర్వాత కుప్పకూలాయి. రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. వెటర్నరీ డాక్టర్ మృతి చెందిన గొర్రెలకు పోస్టుమార్టం చేశారు.

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం

రాయదుర్గంటౌన్: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీరని అన్యాయం జరిగిందని, ఇది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లికార్జున ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. బడ్జెట్ కేటాయింపుల్లో రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీపై కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు ఇప్పటికైనా ప్రశ్నిస్తాయా? లేక సాగిలపడతాయో తేల్చి చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ బడ్జెట్‌లోనూ వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, ప్యాకేజీ విభజన హామీలను పక్కన పెట్టిందన్నారు. విశాఖ రైల్వేజోన్, ఎన్ఐటీ, ఐఐటీ, ట్రిపుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, సెంట్రల్ యూనివర్సిటీ, కడప స్టీల్ ప్లాంట్, వెనుకబడిన జిల్లాల నిధులు, రాజధాని నిర్మాణ నిధులపై ఈ బడ్జెట్‌లో ఊసేలేదన్నారు. ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వైఖరిని అన్ని వర్గాల ప్రజలూ గమనిస్తున్నారన్నారు.

సంబరంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో కలసిన 2003-04 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2003-04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనమయ్యారు. హెచ్‌ఎం వెంకటప్రసాద్ అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఎంఈఓ మల్లారెడ్డి, నాటి ఉపాధ్యాయులను గ్రామంలో ప్రత్యేక కేరళ సంగీత వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. నాటి గురువులు మదన్‌మోహన్, వెంకటేశులు, రాజశేఖర్, వెంకటప్రసాద్, శంకర్, గోవర్ధన్, వెంకటరమణ, నారాయణరెడ్డి, అశ్వర్థప్ప, శివానంద, వీరన్న, మల్లికార్జున, నాగేంద్ర, రాంబాబు, శ్రీనివాసులు, సీతారం ప్రసాద్, మహాలక్ష్మి, శైలజ, వీణాను దుశ్శాలువాలు, మెమెంటోలు పూలమాలతో సన్మానించారు. అపూర్వ సమ్మేళనంతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. మొత్తం 200 మంది చదివిన పాఠశాలలో గుర్తుగా సరస్వతి దేవి విగ్రహాన్ని, ప్రార్థనా వేదికను రూ.6 లక్షలతో నిర్మించిన విషయం విదితమే. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బిల్లా నవీన్‌రెడ్డి, ఎర్రిస్వామి, సురేష్, నాగమోహన్, ధనుంజయ, నాగార్జున, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం



రాజగోపురంపై కలశ స్థాపన పూజలు



బెళుగుప్పలో వాసవీమాత విగ్రహంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

బెళుగుప్ప: మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో స్వర్ణోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం నూతనంగా నిర్మించిన రాజగోపురం, కన్యకాపరమేశ్వరి గోపుర కలశ ప్రతిష్ట పూజలు ఘనంగా నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఉత్సవ విగ్రహంతో ఆర్యవైశ్యులు గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం మహా కుంభాభిషేకం, మహా పూర్ణాహుతి హోమాలు జరుగుతాయని ఆర్యవైశ్య సంఘం సభ్యులు తెలిపారు.

సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

- వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్, ప్రధాన కార్యదర్శి రవికుమార్



జిల్లా స్థాయి సచివాలయ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా సచివాలయల పరిధిలో సంక్షేమ, విద్యా సహాయకుల (వెల్ఫేర్ అసిస్టెంట్లు) డిమాండ్లు పరిష్కరించాలని వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు అల్లప్పరెడ్డి, జిల్లా అధ్యక్షులు అనిల్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ కోరారు. ఆదివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జిల్లా స్థాయి వెల్ఫేర్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు అంశాల్లో రాష్ట్రానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవార్డులు రావడానికి వెల్ఫేర్ అసిస్టెంట్లు కీలకంగా పనిచేశారన్నారు. అత్యధిక పని భారంతో వెల్ఫేర్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఉరవకొండలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌లో తమ డిమాండ్లు పరిష్కరించాలని అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు ధనంజయ, అశోక్, బాలరాజు, దుర్గాప్రసాద్, లక్ష్మణ్, సతీష్ పాల్గొన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

వజ్రకరూరు: మండలంలోని జరుట్లరాంపురం గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం జరుట్ల రామలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని వివిధ పనుల నిర్వహణకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని జరుట్లరాంపురంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆయన మాట్లాడారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 10లోపు ఈఓ కార్యాలయంలో కొటేషన్లు అందజేయాలన్నారు. వివరాలకు ఈఓ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ తీగల రాపిడితో చీనీతోట దగ్ధం



మంటలకు కాలి పోయిన చీనీ తోట, డ్రిప్ పైపులు

బెళుగుప్ప: నరసాపురానికి చెందిన మహిళా రైతు శిల్ప సాగు చేసిన ఆరు ఎకరాల్లోని చీనీతోట ఆదివారం దగ్ధమైంది. బాధితుడు తెలిపిన మేరకు.. ఆరు ఎకరాల్లోని చీనీ పంట ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. మంటలకు తోట పంటతో పాటు డ్రిప్ పరికరాలు దగ్ధమయ్యాయి. పంటతో పాటు డ్రిప్ పరికరాలు కలిపి సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని మహిళా రైతు వాపోయింది.

నిరుద్యోగులను మోసం చేసిన కూటమి సర్కార్



రాయదుర్గంలో ర్యాలీ చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గంటౌన్: జాబ్ క్యాలెండర్ విడుదల చేయలేదు.. ఉద్యోగాలూ లేవు.. నిరుద్యోగులకు భృతి ఎక్కడ అని కూటమి ప్రభుత్వాన్ని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొ్ట్రేష్ ప్రశ్నించారు. శ్రీకాకుళంలో ఈ నెల 6 నుంచి 9 వరకు జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పట్టణంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆదివారం బైక్ ర్యాలీ చేశారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం వద్ద నుంచి వినాయక సర్కిల్ మీదుగా కణేకల్లు రోడ్డు వరకు ర్యాలీ చేశారు. కొ్ట్రేష్ మాట్లాడుతూ ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం మోసం చేసిందన్నాడు. ప్రభుత్వం ఏర్పాటై 8 నెలలు గడిచినా ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు కుమార్, నాగయ్య, శంకర్, సురేష్, మారేష్, హుసేన్, గంగాధర్ పాల్గొన్నారు.

ఘనంగా రాళ్లపల్లి అనంతశర్మ జయంతి



రాళ్లపల్లి అనంత శర్మ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

కంబదూరు: మండలంలోని రాళ్లపల్లి గ్రామంలో ప్రముఖ సంగీత విద్వాంసుడు, రచయిత రాళ్లపల్లి అనంత శర్మ జయంతి వేడుకలను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అనంత శర్మ చిత్రపటాలతో ఊరేగింపు నిర్వహించారు. అనంత శర్మ గొప్పతనం, చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో అనంతశర్మ కుటుంబ సభ్యులు శ్యాంసుందర్, నందా నందన్, అధ్యాపకులు ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కాలిపోయిన కంది పంట



మంటలు అదుపు చేస్తున్న రైతు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో ఆదివారం ఐదు ఎకరాల కంది పంట ప్రమాదశాత్తూ మంటలు చెలరేగి కాలిపోయింది. బాధిత రైతు తెలిపిన మేరకు.. వెంకటేశులుకు చెందిన ఐదెకరాల్లో కంది పంటకు మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల వారు సమాచారం అందించారు. వెంటనే తన పొలంలోకి వెళ్లిన వెంకటేశులు పంటలు పూర్తిగా వ్యాపించాయి. ఫైర్ ఇంజన్‌కు సమాచారం ఇస్తే.. సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దాదాపుగా రూ.లక్ష నష్టపోయినట్లు బాధితుడు తెలిపాడు. మండల పరిధిలోని బోరంపల్లిలోనూ రైతు తిప్పేస్వామికి చెందిన రెండు ఎకరాల మొక్కజొన్న, 1ఎకరం అరటి పంటలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, పూర్తిగా కాలిపోయాయి. రైతులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చినా వారు స్పందించలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. సుమారుగా రూ.2 లక్షలు నష్టపోయినట్లు బాధిత రైతు తిప్పేస్వామి తెలిపాడు.

నేటి నుంచి సుంకులమ్మదేవి ఉత్సవాలు



సుంకులమ్మదేవి అమ్మవారు

కణేకల్లు: మండలంలోని మాల్యంలో సుంకులమ్మదేవి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరపడానికి నిర్వాహకులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం ఉదయం ఉత్సవం, మంగళవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నారు.